



కాత్యాయనీ..నమోస్తుతే!



శరణు మాతా శరణు అంటూ భక్తులు అమ్మవార్లను వేడుకుంటున్నారు.. ఎక్కడికక్కడ ప్రత్యేక పూజలు చేస్తున్నారు.. పలు ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు చేస్తున్నారు.. దసరా ఉత్సవాల్లో భాగంగా మహిళలు కలశాలతో ర్యాలీలు చేస్తున్నారు.. రాజమహేంద్రవరం కోరుకొండ వీవర్స్ కాలనీ కనకదుర్గ సాయి మందిరం వద్ద 300 మంది మహిళలు ఎర్రరంగు చీరలు ధరించి కలశాలతో ర్యాలీ చేశారు. చాగల్లు పాటెమ్మపేటలోని పిడుంగొయ్యి వద్ద మహిళలు పసుపు చీరలతో ర్యాలీ చేశారు. తాళ్లపూడి కనకదుర్గ ఆలయంలో కాత్యాయనిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

చీపురు పట్టిన కలెక్టర్



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టర్ చేకూరి కీర్తి రాజమహేంద్రవరం కోటిలింగాల ఘాట్‌కు వచ్చారు.. మెట్లు అపరిశుభ్రంగా ఉండడం చూశారు.. వెంటనే చీపురు పట్టారు.. ఇలా శుభ్రం చేశారు. ఆమెకు కార్పొరేషన్ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ జత కలిశారు.. పైనుంచి కింద వరకు మెట్లను శుభ్రం చేశారు. అనంతరం కార్పొరేషన్ సిబ్బందికి కలెక్టర్ పారిశుధ్య మెరుగుదలపై పలు సూచనలు చేశారు. - రాజమహేంద్రవరం సిటీ

6 వే!



4 ఆప్షన్‌కే మొగ్గు..

ఆరులైన్ల విస్తరణకు సంబంధించి డీపీఆర్ నివేదికలో నాలుగు రకాల అలైన్‌మెంట్ ఆప్షన్లు విశ్లేషించారు. ఆప్షన్ 1 ఎంచుకుంటే ఆరులైన్ల విస్తరణకు ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారుగా రూ.2,300 కోట్లు,ఆప్షన్ 2 కింద రూ.4,200 కోట్లు, ఆప్షన్ 3 కింద రూ.6,700 కోట్లు, ఆప్షన్ 4 కింద రూ.6,230 కోట్లు వ్యయం కానున్నట్టు గుర్తించారు.అనకాపల్లి నుంచి దివాన్‌చెరువు కింద 160 కిలో మీటర్ల మేర ఆరు లైన్ల విస్తరణ ఖర్చు ఆప్షన్ 4 అలైన్‌మెంట్‌కు రూ.10,233 కోట్లు వ్యయం కానున్నట్టు అంచనా . ఆప్షన్1 కింద రూ.4,586 కోట్లు, ఆప్షన్2 కింద రూ.7577 కోట్లు, ఆప్షన్ 3 రూ.10,760 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. అధికారులు నాలుగో ఆప్షన్‌కే మొగ్గు చూపుతు న్నారు. దీన్ని ఎంపిక చేస్తే ఇబ్బందుల్లేకుండా ప్రాజెక్టు పట్టాలెక్కించవచ్చని భావిస్తున్నారు. అలైన్‌మెంట్ ఆప్షన్లపై స్టేక్ హోల్డర్ల సమావేశాల్లో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీని ప్రకారం కేంద్రానికి ఎన్‌హెచ్ అధికారులు నివేదిక పంపుతారు. దీన్ని పరిశీలించిన తర్వాత కేంద్రం ఏ అలైన్ మెంట్‌కు ఆమోదముద్ర వేస్తుందనేది చూడాలి. ఈ ప్రక్రియ పూర్తిచేసుకుని హైవే విస్తరణకు టెండర్లు పిలవడానికి మరికొంత సమయం పట్టనుంది.

తుని-దివాన్‌చెరువు మధ్య ఆరులేన్లుగా హైవే

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లామీదుగా ప్రయాణించే చెన్నై-కోల్‌కతా 16వ నెంబరు జాతీయరహదారికి ఎట్టకేలకు మంచిరోజులు వచ్చాయి. ఎన్నాళ్లగానో ఎదురుచూస్తోన్న ఆరు వరుసల హైవే విస్తరణకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుత నాలుగు లైన్ల హైవే అత్యంత రద్దీగా మారడం..బ్లాక్‌స్పాట్‌లు అధికమై తరచూ ప్రమాదాలకు నిలయంగా మారడంతో ఆరులైన్లకు విస్తరించేందుకు ఎన్‌హెచ్ అధికారులు శ్రీకారం చుట్టారు.ఈ మేరకు హైవే విస్తరణకు సంబంధించి తాజాగా డీపీఆర్ సిద్ధమైంది. కాకినాడ జిల్లా తుని నుంచి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని దివాన్ చెరువు జంక్షన్ వరకు మొత్తం 91 కి.మీ. మేర విస్తరణకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. విస్తరణ ప్రాజెక్టులో ఆప్షన్1 అలైన్‌మెంట్ ఖర్చు రూ.2,500 కోట్లు అవుతుండగా..ఆప్షన్4 కింద ఖర్చు రూ.6,230 కోట్ల వరకు వ్యయం కానుంది. విస్తరణకు సంబంధించి 8 చోట్ల ఫ్లయ్ ఓవర్లు నిర్మించనున్నారు. అయితే హైవే వెంబడి అనేక గ్రామాలు ఉన్నందున కొన్ని చోట్ల బైపాస్ ప్రతిపాదించారు. ప్రాజెక్టు వ్యయం ఎక్కువే అయినా నాలుగో ఆప్షన్‌కే అధికారులు మొగ్గుచూపుతున్నారు. దీన్ని కేంద్రం పరిశీలించి ఆమోదించిన తర్వాత విస్తరణ పనులకు టెండర్లు పిలవనున్నారు.

ఆరు లేన్లకు ఇదే కారణం..

కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల మీదుగా ప్రయాణించే చెన్నై-కోల్‌కతా 16వ నెంబరు జాతీయరహదారి నిర్మించి దాదాపు పాతికేళ్లపైనే అవుతోంది. ప్రస్తుతం ఉన్న నాలుగు లైన్ల హైవే పూర్తిగా రద్దీగా మారిపోయింది. రహదారిని నిర్మించినప్పుడు అంచనా వేసిన పీక్ ట్రాఫిక్ స్థాయి దాటి వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. తుని నుంచి దివాన్‌చెరువు వరకు ఉన్న హైవే పరిధిలో ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్‌స్పాట్‌ల సంఖ్య విపరీతంగా పెరిగిపో యింది.ఈ నేపథ్యంలో ప్రస్తుత హైవేను ఆరులైన్లుగా విస్తరించాలనే ప్రతిపాదన ఎన్నో ఏళ్లగా ఉంది. అయితే నాలుగు లైన్ల వెంబడి తుని నుంచి దివాన్‌చెరువు వరకు అనేక గ్రామాలు,పట్టణాలు విస్తరించి భారీ వాణిజ్య భవనాలు వెలిశాయి. దీంతో ఆరు లైన్లను ఎలా విస్తరించాలనే దానిపై అధ్యయనం చేసి నివేదిక సిద్ధం చేసే బాధ్యత ఆర్కిటెక్నో, ధృవ్ కన్సల్టెన్సీలకు అప్పగించింది.

హైవే విస్తరణ ఇలా..

విస్తరణకు సంబంధించి కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో తుని, శంఖవరం, తొండంగి, గొల్లప్రోలు,ప్రత్తిపాడు, జగ్గంపేట, ఏలేశ్వరం,గండేపల్లి మండలాల పరిధిలోని తుని, చేపూరు, తేటగుంట,అరెంపూడి, పీతః చిన్నయ్యపాలెం,సీతాయంపేట,ప్రత్తిపాడు,జగపతినగరం, సోమవరం,బూరుగుపూడి, రామవరం, రాగంపేట,తాళ్లూరు, బొర్రంపాలెం, మల్లేపల్లి, గండేపల్లి, మురారి, కల్వచర్ల, రాజానగరం, జగ న్నాథపురం, వెంకటపురం, నరేంద్రపురం, వెలు గుబంద గ్రామాల మీదుగా కొత్త లైన్ల వరుస నిర్మాణం జరగనుంది. కాకినాడ జిల్లా పరిధిలో తాండవ నది, అన్నవరం బైపాస్, ఎర్ర కాలువ వద్ద మూడు బ్రిడ్జిలు ప్రతిపాదించారు. తుని పరిధిలోని తిమ్మాపురంలో రైల్వే లైన్ నేప థ్యంలో ఆర్వోబీ ప్రతిపాదించారు. తూర్పుగోదా వరి జిల్లా పరిధిలో కాకినాడ ఏడీబీ రోడ్డు, కోరుకొండ, రాజానగరంతో పాటు కాకినాడ జిల్లాలో 11 చోట్ల మేజర్ క్రాసింగ్‌లు గుర్తించారు. కాకినాడ జిల్లా పరిధిలో చేపూరు, ఎర్రవరం, బూరుగుపూడి,రామవరం, తాళ్లూరు, మల్లేపల్లి,గండేపల్లి,మురారి తదితర చోట్ల 8 ఫ్లయ్ ఓవర్లు నిర్మించాల్సి ఉంటుందని ప్రతిపా దించారు. తేటగుంట,దివాన్‌చెరువు పరిధిలో మూడు కిలో మీటర్ల మేర రిజర్వుఫారెస్ట్ మీదుగా రహదారి నిర్మించాల్సి ఉంటుందని గుర్తించారు.

- ప్రస్తుతం నాలుగు లేన్లు
- ఆరులేన్లుగా డీపీఆర్ సిద్ధం
- 4 రకాల అలైన్‌మెంట్ ఆప్షన్లు
- కాకినాడ జిల్లాలో 80 కి.మీ
- తూ.గో. జిల్లాలో 11 కి.మీ
- వ్యయం రూ.6,230 కోట్లు
- 8 చోట్ల ఫ్లయ్ ఓవర్లు
- 3 చోట్ల బ్రిడ్జిలు
- 14 చోట్ల మేజర్ క్రాసింగ్‌లు
- త్వరలో కేంద్రం టెండర్లు

దాదాపు రెండున్నరేళ్ల ఈ సంస్థలు అధ్యయనం చేసి ఎట్టకేలకు నాలుగు రకాల అలైన్‌మెంట్ ఆప్షన్లతో డీపీఆర్ సిద్ధం చేశాయి. కాకినాడ జిల్లాలో 80 కిలోమీటర్లు, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 11 కి.మీ.మేర ఆరులైన్ల విస్తరణ పనులు చేపట్టాలంటే ఒక్కో ఆప్షన్ కింద ఎంత వ్యయం అవుతుందో నివేదికలో విశ్లేషించాయి.

జీఎస్టీతో ఏడాదికి రూ.150 కోట్లు లాభం

తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో అంచనా

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జీఎస్‌టి 2.0 వల్ల రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న జీఎస్‌టీ జేసీ పరిధిలోని తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఏడాదికి రూ.120 నుంచి రూ.150 కోట్లు ప్రజలకు కలిసి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.జీఎస్టీ తగ్గింపు వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల కోట్లు లాభం వస్తుందని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. జిల్లాలో పూర్తిస్థాయి అంచనాలు వేయలేదు. సుమారు ఇంత వరకూ లాభం చేకూరుతుందని చెప్పడం గమనార్హం. వాస్తవానికి గురువారం నుంచి వస్తువుల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ముందుగా శాఖలవారీగా ప్రజల్లో వెళుతున్నారు. శుక్ర లేదా శనివారాల నుంచి అవగాహన సదస్సులు నిర్వహించడానికి సమాయత్తం అవుతున్నారు. పోస్టర్లు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం ఆరంభించారు.జీఎస్టీ అధికారులు వివిధ షోరూమ్‌లకు వెళ్లి, వ్యాపారులు, వినియోగదారుల సమక్షంలో అవగాహన కల్పిస్తున్నారు. అన్ని షాపుల వల్ల ధరల వివరాలు పెట్టించే ప్రయత్నం చేస్తున్నారు.వచ్చే నెల 19వ తేదీ లోపు మొత్తం జీఎస్టీ తగ్గింపు అమలు చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారులతో నోడల్ అధికారుల కమిటీలను నియమించారు.సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ ప్రచారం చేయనున్నారు.ఒక యాప్ సిద్ధం చేసి ప్రతి మొ బైల్‌లో ఉండేవిధంగా ప్రచారం చేయనున్నారు.కార్లు, మోటారు సైకిళ్లపై కూడా తగ్గడం గమనార్హం. పాల ఉత్పత్తులకు సంబంధించి చిన్న చిన్న దుకాణాల వల్ల పాత,కొత్త ధరల వివరాలు పెడుతున్నారు.కానీ ప్రస్తుతం పాత ధరలకే అమ్మడం గమనార్హం. కొత్తసరుకుతో ఎమ్మార్పీ రేట్లు ముద్రించిన వెంటనే కొత్తధరలకే అమ్ముతామని దుకాణదారులు మోసగిస్తున్నారు.

హౌస్ బోట్లకు గోదావరి అనుకూలం

క్షేత్రస్థాయిలో కేరళ బృందం పర్యటన - కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం,సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గోదావరి ప్రాంతం కేరళ తరహా హౌస్‌బోట్ల నిర్వహణకు అనుకూలంగా ఉందని కేరళ పర్యాటక బృందం స్పష్టం చేసింది. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో జిల్లా అధికారులతో కలిసి గురువారం క్షేత్రస్థాయి పర్యటన చేసింది. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి హౌస్‌బోట్స్, క్రూయిజ్ అభివృద్ధి అంశాలపై హౌస్‌బోట్ల బిల్డర్లు, ఆపరేటర్ల బృందంతో సమీక్షించారు.జిల్లాలో ఇకో టూరిజం, అడ్వంచర్ స్పోర్ట్స్, హేవలాక్ బ్రిడ్జి, టెంపుల టూరిజం, కడియం నర్సరీల ప్రాంతాల్లో టూరిజం అభి వృద్ధికి అవకాశాలు ఉన్నాయన్నారు. పోలవరం,కొ వ్వూరు,మునికూడలి, రాజమహేంద్రవరం ఘాట్లలో టెంపుల్ టూరిజంకు ప్రాధాన్యత ఉన్నట్టు చెప్పారు. హౌస్‌బోట్ల బృందం సరస్వతి, పద్మావతి, పుష్కర్‌ఘాట్లు, గోపాద, శివలింగ ఘాట్లు,పిచ్చుకలంక, ధవళేశ్వరం బ్యారేజీ, కడి యపులంక నర్సరీలు,పోలవరం ప్రాజెక్టు, సమీప ప్రాంతాల్లో పర్యటించినట్టు తెలిపారు. హౌస్ బోట్‌ను పైలెట్‌గా ఈ ప్రాంతం నుంచే ప్రారంభించాలని కలెక్టర్ బృందానికి సూచించారు. కేరళ బృందం ప్రతినిధులు మాట్లాడుతూ హౌస్‌బోట్ల ద్వారా జిల్లాకు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందన్నారు.సమావేశంలో రాష్ట్ర పర్యాటక జీఎం నాంచారయ్య, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, ఇరిగేషన్ డీఈ బి.మూర్తిరాజు,కేరళ బృందం పాల్గొన్నారు.

తలుపులు పగలకొట్టి.. వృద్ధురాలిని కొట్టి

నల్లజర్లలో భారీ చోరీ

5

గోవులను వధించి నూనె తయారీ

తునిలో పోలీసుల దాడులు



కొత్త మాస్టార్లు గురువారం ఉదయం ఉత్సాహంగా విజయవాడలో సీఎం సభకు తరలి వెళ్లారు.. ఆర్టీసీ బస్సుల్లో 3315 మంది ఉపాధ్యాయులు బయలుదేరారు.. ప్రతి ఒక్కరిలో కొత్త ఉత్సాహం కనిపించింది.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

రంగంపేటలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

రంగంపేట,సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తూర్పుప్రాంత విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు.రంగంపేట విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో గురువారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించారు.విద్యుత్ వినియోగదారుల సమస్యలపై తాము ఇస్తున్న ఉత్తర్వులను కొందరు పాటించడం లేదని దీనిని తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. న్యాయస్థానం పరిధిలో 11జిల్లాలు ఉండగా అందులో ఒక్క కాకినాడ జిల్లా మాత్రమే బాగా స్పందిస్తుందన్నారు. న్యాయస్థానం సాంకేతిక సభ్యుడు ఎస్.రాజబాబు మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి సామగ్రి కొరత ఆటంకంగా ఉం దన్నారు. జలకళకు సంబంధించి రంగంపేట మండలంలో 30 గొట్టపుబావులకు సమస్య ఉండగా 8 బావుల సమస్య నెల రోజుల్లో పరిష్కారం అవుతుందని సత్యనారాయణ అన్నారు. వ్యవసాయ కనెక్షన్ల విషయంలో రంగం పేటకు ప్రాధాన్యత ఇవ్వాలని మర్రిపూడి రైతు పుట్టా సోమన్న చౌదరి విజ్ఞప్తి చేశారు. రంగంపేటకు చెందిన ఉండవిల్లి గిరిబాబు, బి.దుర్గారావు, పెదరాయవరానికి చెందిన మోదుకూరి గోపాలకృష్ణ పలు సమస్యలు విన్నవించారు.విద్యుత్ వినియోగదారులు 53 ఫిర్యాదులు అందజేశారు.ఈ సమస్యల పరిష్కరిస్తామని విద్యుత్ ఈఈ నటరాజన్,ఏఈ టి.శిరీష హామీ ఇచ్చారు. సభ్యులు ఎస్.సుబ్బారావు, ఎస్.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



బ్యాడ్మింటన్ కోర్టులో తలపడుతున్న క్రీడాకారులు

క్రీడలకు కేరాఫ్ రాజమహేంద్రి

ఆలిండియా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆరంభంలో కలెక్టర్ కీర్తి

- 1300 మంది క్రీడాకారుల హాజరు
- 28న ముగింపు




ఆడుతున్న కలెక్టర్, ఎస్పీ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక రాజధానిగా ఉన్న రాజమహేంద్రవరం రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల నిర్వహణకు కేరాఫ్‌గా మారుతోందని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. జాతీయ బ్యాడ్మింటన్ అసోసియేషన్, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నారాయణపురంలోని నగరపాలక సంస్థ బ్యాడ్మింటన్ కోర్టులో గురువారం ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ - 2025 ప్రారంభించి మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు గెలుపు ఓటములను సమంగా తీసుకోవాలన్నారు.సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా రాజమహేంద్రవరాన్ని క్రీడాహబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. గతేడాది ఇంటర్‌స్టేట్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించగా, ఈ సారి జాతీయస్థాయిలో ర్యాంకింగ్ టోర్నమెంట్ జరగడం శుభపరిణామమన్నారు. ఖేలో ఇండియా టోర్నమెంట్‌ను రాజమహేంద్రవరంలో నిర్వహించాలని కోరతామన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన ఇన్‌ఛార్జి అనుశ్రీ సత్యనారాయణ ఒక టీమ్‌గా, కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహ కిషోర్ మరో టీమ్‌గా కాసేపు బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 1300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ నెల 28వ తేదీన టోర్నమెంట్ ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి అంకన్నచౌదరి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నాయకులు, వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు.



ఆడేస్తున్న క్రీడాకారిణి



గాలిలో ఎగిరి షాట్ కొడుతున్న బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

శబరిమలకు బస్‌లు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో పంచారామ క్షేత్రాలు, శబరిమల యాత్రకు ప్రత్యేక బస్సులు బస్సులు నడుపుతామని ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు.ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరంలోని డీపీటీవో కార్యాలయంలో పోస్టర్లు, కరపత్రాలు డిపో అధికారులతో కలిసి విడుదల చేసి మాట్లాడారు. కార్తీక సోమవారాల్లో పంచారామ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటకు బస్సులు ప్రతి ఆదివారం సాయంత్రం 7 గంటలకు రాజమండ్రి డిపో నుంచి బయలుదేరి సోమవారం రాత్రి 10 గంటలకు తిరిగి డిపోకు చేరతాయన్నారు. శబరిమల 10 రోజుల యాత్రలో బెజవాడ, శ్రీశైలం, మహానంది, కాణిపాకం,అరుణాచలం, పళని, పంబ, త్రివేంద్రం,కన్యాకుమారి, తిరుచందూరు,రామేశ్వరం, మధురై, తిరుపతి, శ్రీకాళహస్తి క్షేత్రాలు దర్శించుకోవచ్చన్నారు.శబరిమలకు ఐదు, ఏడు రోజుల యాత్ర ఉందన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 9 మందికి జైలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 9 మందికి కోర్టు జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ సీఐ ఎండీ అబ్దుల్ నబీ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే ఉద్దేశంతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌ని రోజూ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 60 కేసులు నమోదు చేశారు. నిందితుల్లో 51 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా, ఆరుగురికి రెండు రోజులు, ముగ్గురికి మూడు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ జడ్జి సి.రమ్య ఆదేశాలిచ్చారని సీఐ పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు.

వైభవోపేతం...మహాశక్తి యాగం

40 కోట్లకు చేరిన లలిత సహస్ర కుంకుమార్చన

పాల్గొన్న 15 వేలమంది భక్తులు



సామూహిక లలితా సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో 3వ మహాశక్తి యాగం వైభవోపేతంగా సాగుతోంది. గురువారం మూడు పర్యాయాలు పఠించిన లలితా సహస్రనామ పారాయణలో సుమారు 15 వేలమంది భక్తులు పాల్గొన్నారు. ప్రముఖ విద్వాంసుడు నాగరాజు వేణుగానంతో అమ్మను స్తుతిస్తూ భక్తులను పులకింపచేశారు. స్వామి పరిపూర్ణానంద సరస్వతి భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. నాలుగు రోజుల్లో 40 కోట్ల లలితాసహస్రనామ కుంకుమార్చన పూర్తయ్యిందన్నారు. అయోధ్య నుంచి బాలరాముడు, బంగారు ధనుస్సు, ఐదు కలశాలను ఇక్కడకు తీసుకువస్తున్నారని, శుక్రవారం వీటిని భక్తులు తిలకించే అవకాశాన్ని అమ్మ కల్పిస్తోందన్నారు. ఈనెల 29న త్రికోటి మహాసరస్వతి పూజ నిర్వహిస్తామన్నారు. మూడేళ్ల బాలుడు హాస్విదేవ్ ఆలపించిన హనుమాన్ చాలీసా, లలితా సహస్రనామ పారాయణ ఆకట్టుకున్నాయి. సుమారు 30వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఉదయం రుత్వికుల ఆధ్వర్యంలో అమ్మవారికి గాయత్రి సౌర, అన్నసూక్త అన్నపూర్ణ హోమం, సహస్ర చండీ, సహస్ర రుద్ర, బగళాముఖి, వారాహి, పత్యంగిరా, వటుక, భైరవ హోమాలను పలు రకాల విశేష ద్రవ్యాలతో నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అనంతలక్ష్మి పాల్గొన్నారు. సర్పవరం సీఐ బి.పెద్దిరాజు, ట్రాఫిక్ సీఐ డి.రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

విజయవాడ దుర్గమ్మకు అన్నవరం దేవస్థానం సారె



విజయవాడ దుర్గమ్మకు సారె సమర్పిస్తున్న అన్నవరం ఈవో, ఇతర అధికారులు

అన్నవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మకు అన్నవరం దేవస్థానం తరుపున గురువారం ఈవో సుబ్బారావు, దేవస్థానం ప్రధానార్చకులు, ఇతర అధికారులు పట్టువస్త్రాలు, సారెను సమర్పించారు. ఏటా దసరా ఉత్సవాల్లో అమ్మవారి సోదరుడిగా సత్యదేవుడి తరుపున పట్టువస్త్రాలు అందించడం, స్వామివారి వార్షిక కల్యాణాలకు విజయవాడ దేవస్థానం నుంచి అన్నవరం దేవస్థానానికి పట్టువస్త్రాలు తీసుకురావడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా అన్నవరం దేవస్థానం అధికారులకు విజయవాడ దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈవో వెంట ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఏఈవో భాస్కర్, సూపరెంటెండెంట్ రామకృష్ణ, అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు, ఏపీఆర్వో గణపతి తదితరులున్నారు.

శారదాదేవిగా రత్నగిరి దుర్గలు

అన్నవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాల్గోరోజైన గురువారం రత్నగిరి దుర్గలైన వనదుర్గ, కనకదుర్గలు శారదాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేషపూజలు, కుంకుమార్చనలు రుత్విక్‌లు నిర్వహించారు.



శారదాదేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గ

సీపీఐ జాతీయ సమితి సభ్యుడిగా మధు




రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి సభ్యుడిగా తూర్పుగోదావరి జిల్లా సీపీఐ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న తాటిపాక మధు ఎన్నికయ్యారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకూ చండీఘడ్‌లో జరిగిన సీపీఐ 25వ జాతీయ మహాసభల సందర్భంగా గురువారం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శ డి.రాజా నూతన జాతీయ సమితిని ప్రతిపాదించగా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తాటిపాక మధును జాతీయ సమితి సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మధుకు పలు ప్రజాసంఘాల నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉన్న సమయంలో పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు అనేక భూ పోరాటాలు చేశామని, జాతీయ సమితి సభ్యుడిగా తాను ఎన్నిక కావడం మరింత బాధ్యతను పెంచిందని ఈ సందర్భంగా మధు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గోవులను వధించి నూనె తయారీ

- తునిలో పోలీసుల దాడులు
- నలుగురి అరెస్ట్
- గో మాంసం, ఆయిల్ స్వాధీనం

తుని రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో దారుణం వెలుగుచూసింది. పవిత్రమైన గోవులను వధించే ముఠా గుట్టురట్టు అయింది. తుని కేంద్రంగా కొన్నేళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారంపై పోలీసులు దృష్టి సారించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తుని సీఐ గీతా రామకృష్ణ బృందం పట్టణ శివారు రామకృష్ణా కాలనీలో గురువారం ఆకస్మిక దాడులు చేశారు. అదే ప్రాంతంలో తాండవ నదీ తీరాన ఆనుకుని ఒక ఇంట్లో గోవులను దాచిపెట్టి వధించి ఆయిల్ తయారు చేస్తున్నట్టు గుర్తించారు. గో మాంసంతో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ గీతారామకృష్ణ మాట్లాడుతూ ఇదే ప్రాంతంలో 2023లో గో మాంసం ఆయిల్ తయారీపై దాడి చేయగా ఇదే రీతిన గో మాంసం, ఆయిల్ పట్టుబడిందని కేసు నమోదు చేశామన్నారు. అదే వ్యక్తులు ఇప్పుడు ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్టు తెలిసిందన్నారు. స్థానిక వీఆర్వో, వెటర్నరీ డిపార్టుమెంట్‌తో కలిసి దాడులు చేశామని.. 8 టిన్నుల్లో గో మాంసం నుంచి తీసిన నూనెలు, గో మాంసం సీఐ పట్టుపడిందని తెలిపారు. మహ్మద్ సంసరే, మహ్మద్ హారీఫ్, మహ్మర్ ఇరీస్, బానేపల్లి మహేష్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

తునిలో గో మాంసం నుంచి తీసిన కొవ్వు పదార్థాలు, గో మాంసం నిల్వలు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

అర్ధరాత్రి తలుపులు పగలగొట్టి.. వృద్ధురాలిని కొట్టి..

15 కాసుల బంగారం, రూ.50వేల నగదు దోచుకున్న నలుగురు దుండగులు

రెండు మోటార్‌సైకిళ్లను సైతం దొంగిలించి వాటిపై పరారీ

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో ఘటన

నల్లజర్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఓ ఇంటి తలుపులు పగల గొట్టి ప్రవేశించి నిద్రిస్తున్న ఒంటరి వృద్ధురాలిపై దాడి చేసి మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవిదిద్దు లు, బీరువాలో ఉన్న 4 గాజులు మొ త్తం 15 కాసుల బంగారుం, రూ.50 వేల నగదు దోచుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లజర్ల సెంటర్‌లో వృద్ధురాలు పాకలపాటి సుభద్ర ఒంటరిగా నివాసం ఉంటుంది. కుమారుడు రమేష్ తల్లికి పగలు సేవలందించి రాత్రి అదే గ్రామంలోని అత్తగారింటికి వెళ్లి నిద్రిస్తాడు. ఇది గమనించిన దుండగులు బుధవారం అర్ధరాత్రి 1.30 గంటలకు నలుగురి ముసుగులు ధరించి ముందుగా ఇంటి తలుపుకొట్టారు. తీయకపోవడంతో పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవిదిద్దులు తీసుకుని బీరువా తాళాలు ఎక్కడున్నాయని ఆమెపై రాళ్లతో దాడి చేశారు. ఆమె గాయాలు భరించలేక బీరువా తాళాలు ఇచ్చేసింది. బీరువాలో ఉన్న 4బంగారు గాజులు, రూ.50 వేల నగదు దోచుకున్నారు. భయంతో వృద్ధు రాలు బిగ్గరగా కేకలు వేయడంతో దొంగలు ఆమె సెల్‌ఫోన్ తీసుకుని గోడ దూకి పక్కింట్లోని రెండు మోటార్‌సైకిళ్లను సైతం దోచుకుని వాటిపై పారిపోయారు. తర్వాత తేరుకున్న సుభద్ర సెంటర్‌కు పరిగెత్తుకుంటూ వెళ్లి మరొకరి సెల్‌ఫోన్ తీసుకుని కుమారుడు రమేష్‌కు ఫోన్ చేయడంతో అతడు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన జరిగిన ప్రదేశానికి వచ్చి కొవ్వూరు డీఎస్పీ దేవ కుమార్, దేవరపల్లి సీఐ నాయక్ పరిశీలించారు. రాజమహేంద్రవరం నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరిం చారు. కేసు నమోదు చేశామని, నిందితులను త్వరలో పట్టుకుం టామని డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. సుభద్ర ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలో దుండగులు వచ్చిన దృశ్యాలు కనిపిస్తున్నాయని, వారి కోసం నాలుగు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నట్టు పేర్కొన్నారు.



బీరువాలోని దుస్తులను చెల్లాచెదురుగా పడేసిన దొంగలు



గాయపడిన వృద్ధురాలు

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాల, బాలికల జట్లు

పిఠాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియను కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే అండర్-19పోటీలకు అర్హులైన క్రీడాకారుల ఎంపికకు గానూ పోటీలు జరిగాయి. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. ఎంపిక ప్రక్రియను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, ఉమ్మడి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఛైర్మన్ వియ్యపు రామన్నరాజు ప్రారంభించగా, ఫిజికల్ డైరెక్టర్ రత్నశామ్యూల్, టెక్నికల్ అఫిషియల్ పి.పద్మ, గోవింద్, పి.లక్ష్మణరావు, బి.కృష్ణార్జున, వంశీ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. కార్యక్రమంలో డి.రామకృష్ణ, కె.చిన్నబ్బాయి, పల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన జట్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ 19 బాలుర జట్టు సభ్యులుగా జశ్వంత్, జె.ప్రణీత్‌కుమార్, ఎం.నానిబాబు, బి.సుశాంత్, వి.హేమంత్, ఎం.రిషేంద్రవర్మ, బి.సోమరాజు, పి.నాని, కె.ప్రతీష్, ఎం.అనిల్‌కుమార్, కె.అచ్యుత్, డి.అఖిల్, డి.బంగారం, ఆర్.లోకేష్, దుర్గాసాయితేజ, వి.రాము ఎంపికయ్యారు. బాలికల జట్టు సభ్యులుగా పి.సంధ్య తేజశ్రీ, ఎం.కల్యాణి, జి.తేజస్విని, పి.దివ్య, పి.మహాలక్ష్మి, పి.భవానీ, పీవీఎల్‌జీ భవానీ, కె.జాహ్నవిశ్రీ, భవ్యశ్రీ, సీహెచ్.అపర్ణ, ఎం.నవ్య, ఆర్.స్వర్ణప్రియ, డి.దుర్గాఅలేఖ్య, కె.హరిణి, ఎస్.శ్రీసత్య, జె.ప్రియాంక ఎంపికయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పుల్లేటికుర్రు విద్యార్థులు



పోటీలకు ఎంపికైన పుల్లేటికుర్రు విద్యార్థులు

అంబాజీపేట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎ.వెంకట్రావు, పీడీ అందె సూర్యనారాయణ తెలిపారు. బాల్‌బాడ్మింటన్, ఖోఖో, అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. సీహెచ్.జ్యోతిసాయి పల్లవి, ఎ.రష్మిత బాల్‌బాడ్మింటన్, వాలీబాల్‌కు... జి.రమాఅషిత 1500 మీటర్ల పరుగుపోటీల్లో, సీహెచ్ హర్షవర్ధని, 3కేఎం, 4కేఎం పరుగు పోటీల్లో ఎం.తేజస్విని, దుర్గాశ్రీ ప్రథమస్థానం, మర్రి తేజస్వ 3కేఎంలో ప్రథమ స్థానం సాధించారు. కొప్పిశెట్టి మనోజ్ జూనియర్ అథ్లెటిక్స్ వవిభాగంలో ప్రతిభ కనబరిచాడు. అలాగే మర్రి తేజస్వ, సీహెచ్ హర్షవర్ధని ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు వారు తెలిపారు. క్రీడాకారులకు తర్ఫీదును అందించిన పీడీ అందె సూర్యనారాయణ, పీఈటీ దొమ్మేటి ఉదయభాస్కర్‌ను సత్కరించారు.

శాస్త్రవేత్తల జాబితాలో జేఎన్టీయూకే ప్రొఫెసర్లు



ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు



ప్రొఫెసర్ బీటీ.కృష్ణ

జేఎన్టీయూకే, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ, ప్రచురణ సంస్థ ఎల్సీ వీర్ ఆధ్వర్యంలో జరిగిన సర్వేలో 2025 సంవ త్సరానికి గాను ప్రపంచ రెం డు శాతం శాస్త్రవేత్తల జాబితాలో జేఎన్టీయూకే ప్రొఫెసర్లు స్థానాలు పొందారు. ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ విభాగంలో ఎనర్జీ ఏఐ ఇమేజ్ ప్రాసెసింగ్ సబ్ కేటగిరీలో వారికి చోటు దక్కిందని ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఈఈఈ విభాగం ప్రొఫెసర్, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావుకు 6,975వ స్థానం... ఈసీఈ విభాగం ప్రొఫెసర్ బీటీ.కృష్ణకు 8,584వ స్థానం లభించిందన్నారు. ఈ విధంగా చోటుదక్కడం జేఎన్టీయూకే చరిత్రలో ఇదే మొదటిసారి అన్నారు. ఇద్దరు ప్రొఫెసర్లు 100కు పైగా జర్నల్స్‌లో పేపర్లు ప్రచురించారన్నారు. వారిని వీసీ ప్రసాద్, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి

ఆత్రేయపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన కొమ్మరి స్వర్ణకుమారి(45) ఈ నెల 18న తన ఇంటి డాబాపై ఆరవేసిన దుస్తుల తీస్తున్న సమయంలో డాబాకు అనుకుని విద్యుత్ వైర్లపై ఉన్న పక్షులు ఒక్కసారిగా ఎగరడంతో విద్యుత్‌వైర్లు కుమారికి తగిలి షాక్‌కు గురైంది. తీవ్రగాయాలైన ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్ రాము తెలిపారు.

తాపీమేస్త్రికి గాయాలు

పి.గన్నవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంముంగండ గ్రామదేవత శ్రీముత్యాలమ్మ ఆలయ సమీపంలో ఒక ఇంటిపై పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు 11 కెవి విద్యుత్ తీగలు తగలి తాపీమేస్త్రీకి తీవ్ర గాయాలయ్యాయి. బోర్రా శ్రీనివాస్‌కు సంబంధించిన బిల్డింగ్ రెండో అంతస్తులో పోతవరం గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ గోసంగి శ్రీనివాస్ సిమెంట్ పనులు నిర్వహిస్తున్నాడు. ఇనుప ఊచలు వంచే సమయంలో అటుగా వెళ్లిన విద్యుత్ తీగల ద్వారా షాక్ తగిలింది. దీంతో శ్రీనివాస్ అక్కడ నుంచి కిందికి పడిపోవడంతో కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అమలాపురం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

గణన పద్ధతులపై అంతర్జాతీయ సెమినార్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గణన శక్తితో గణితం కలయిక మనం సమస్యలను సంప్రదించే విధానాన్ని మార్చివేసిందని నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం గణిత విభాగం ఆధ్వర్యంలో గణన పద్ధతులపై ఆన్లైన్ అంతర్జాతీయ సెమినార్ గురువారం జరిగింది. గణితంలో కంప్యూటేషనల్ టెక్నిక్‌ల ఇతివృత్తంగా జరిగిన ఈ సెమినార్‌లో వీసీ మాట్లాడుతూ భౌతికశాస్త్రం, ఇంజనీరింగ్‌లో సంక్లిష్ట వ్యవస్థల మోడలింగ్ నుంచి గణిత పద్ధతులను ఉపయోగించి కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, క్రిప్టోగ్రఫీలో పెద్దఎత్తున డేటాను నిర్వహించడం వరకూ ఒక అనివార్య సాధనంగా మారిందని చెప్పారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్ యూనివర్సిటీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ రెహనా నస్రీన్, వరంగల్ ఎన్ఐటీ నుంచి ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య హాజరై గణితంలో గణన పద్ధతులపై క్షుణ్ణంగా ప్రజంటేషన్ ఇచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి ప్రిన్సిపాల్, పి.విజయనిర్మల, కన్వీనర్ టి.హైమావతి, కోకన్వీనర్లు కె.రేవతి, కేవీఎం వరకుమార్, శ్రీనివారావు, మల్లిప్రియ, అశోక్, గీత, సుజాత పాల్గొన్నారు.

దేవీచౌక్‌లో ప్రత్యేక పూజలు



దేవీచౌక్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో శ్రీబాలాత్రిపుర సుందరి దేవి నాల్గోరోజు గురువారం శ్రీకాత్యాయిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రత్యేక పూజలు చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ద్రాక్షారామలో...

ద్రాక్షారామ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మాణిక్యాంబ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

జల ప్రహార్.. సైనికా జోహార్!

కాకినాడ తీరంలో ముగిసిన యుద్ధ విన్యాసాలు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ డీప్ సముద్రంలో భారత నౌకా దళం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి ఉభయ చర వ్యాయామం (జల ప్రహార్-25) యుద్ధ విన్యాసాలు విజయవంతంగా ముగిసినట్టు అధి కారులు తెలిపారు. ఉమ్మడి సైనిక విన్యాసం, యుద్ధ సన్నదతను మరింత మెరుగుపరచడానికి ఈ విన్యాసాలను ఏటా భారత త్రివిధ దళాల ఆధ్వర్యంలో కాకినాడ సముద్ర తీరంలో నిర్వహిస్తున్నాయి. ద్వైవార్షిక ఉమ్మడి వ్యాయామం జల ప్రహార్‌ను భారత దేశ తూర్పు సముద్ర తీరంలో ఉభయచర కార్యకలాపాల్లో సెంటర్-సరీస్ సినర్జీ, కార్యాచరణ ప్రణాళిక అమలును ధృవీకరించడం, త్రివిధ దళాల సన్నద్ధతను మరింత మెరుగుపరచడం లక్ష్యంగా చేసుకుని సెప్టెంబరు 21-23 వరకు కాకినాడ సముద్ర మధ్యభాగంలో విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్ఎస్ ఘరియల్‌లోకి సైన్య దళాలను ప్రవేశ పెట్టడం, ఏకీకృతం చేయడం చేశారు. ఈ విన్యా సాల్లో భాగంగా ఆన్‌బోర్డు శిక్షణ, భద్రతా బ్రీఫింగ్‌లు, నావికుడి జీవితం వైపు దృష్టి సారించడం, క్రీడలు, స్నేహాన్ని పెంపొందించేందుకు ఈ ఉమ్మడి పరస్పర విన్యాసాలు ఎంతగానో దోహద పడతాయని అధికారులు తెలిపారు. విన్యాసాల్లో భాగంగా సముద్రతీరంలో హార్డ్ బీచింగ్, ఎన్‌సీల, బీఎంపీలను ప్రారంభించి, ఎస్ఓపీలు, ఉమ్మడి శిక్షణ అంతా ఒక పద్ధతిలో విన్యాసాలు నిర్వహిం చినట్లు త్రివిధ దళాల అధికారులు తెలిపారు. ఈ వ్యాయామం రెండు దశల్లో నిర్వహించగా, మొద టి దశలో ఈనెల 16నుంచి 20 వరకు విశాఖప ట్నంలో హార్బర్‌దశలో చేయడం జరిగిందన్నారు.




కాకినాడ తీరంలో యుద్ధ విన్యాసాల దృశ్యాలు




విజయదుర్గా పీఠంలో కుంకుమ పూజలు

రాయవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠంలో అమ్మవారు రజత కవచధారిగా పూజలందుకుంది. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపి కుంకుమ పూజలు జరిపారు. ఆధ్యాత్మికవేత్త బేతవోలు రామబ్రహ్మం రామాయణం విశిష్టత వివరించగా, గొర్తి సుబ్రహ్మణ్య శర్మ అమ్మవారి అవతారాలు, రాక్షస సంహారాన్ని భక్తులకు తెలియజేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గ సేవా సమితి ప్రతినిధులు జీఎస్వీ కామేశ్వరి, భాస్కరనారాయణ తదితరులున్నారు.

చీరమేను వచ్చేసింది...

యానాం మార్కెట్‌లో సందడి





యానాం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతమైన యానాం మార్కెట్‌లోకి చీరమేను వచ్చేసింది. యానాం, గోదావరి జిల్లావాసులు ఎంతో ఇష్టంగా తినే చీరమేను శీతకాలం ప్రారంభంలోను, ఎక్కువగా దీపావళి ముందుగా దొరుకుంది. ముఖ్యంగా తూర్పుగాలు సమయంలో ఈ చీరమేను మత్స్యకారులకు దొరుకుతుంది. ఈ చేపలు చాలా చిన్నగా వేళ్ల సందులు, వలలోంచి జారిపోయేంత చిన్నగా ఉండడంతో గతంలో చీరలతో మాత్రమే పట్టేవారు. తర్వాత చిన్నచిన్న వలలతో వాటిని పట్టుకుంటున్నారు. ప్రస్తుతం తూర్పుగాలులు వీస్తుండటంతో గత 2 రోజులుగా యానాం మార్కెట్‌లోకి సూమరు ఐదు క్యారేజీల చీరమేను వచ్చింది. ప్రస్తుతం సేరు రూ.1500 నుంచి 2000 వరకు ధర పలికింది. వీటితో అనేక రకాల వంటలు చేసుకోవచ్చు. ఇకపై అడపదడపా దీపావళి వరకు చీరమేను దొరకనుంది.

కాత్యాయనిగా కనకదుర్గమ్మ

గోకవరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గోకవరంలోని వీరభద్రుడి గద్దెలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన గురువారం కనకదుర్గమ్మ కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయంలో ఉదయం దుర్గాహోమం నిర్వహించారు. హోమంలో అమ్మవారి ప్రతిరూపం కనిపించడంతో కమిటీ సభ్యులు, భక్తులు తిలకించేందుకు పోటీపడ్డారు.

నగర సమగ్ర అభివృద్ధే ధ్యేయం

అడిషనల్ కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): నగర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్ రూపొందించాలని కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ 2026-27 వార్షిక బడ్జెట్‌ను సిద్ధం చేసేందుకు ఆయన గురువారం స్థానిక కార్యాలయంలో తన చాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతులు, పార్కులు, డ్రైనేజీలు, రహదారుల అభివృద్ధి పనులను పరిగణలోకి తీసుకుని 2026-27 ప్రతిపాదిత బడ్జెట్ రూపొందించాలన్నారు. బడ్జెట్ అంచనాలను అక్టోబరు 8నాటికి అందజేయాలని శాఖాధిపతులకు సూచించారు. సమావేశంలో డిప్యూటి కమిషనర్ ఎస్ వెంకట రమణ, అన్నివిభాగాల అధికారులు పాల్గొన్నారు.

రేపు లోక్ కళ్యాణ్ మేళా

వీధి విక్రయదారులకు ఈ నెల 27న స్థానిక ఆనం కళాకేంద్రంలో లోక్ కళ్యాణ్ మేళా నిర్వహిస్తున్నామని అడిషనల్ కమిషనర్ తెలిపారు. ఇందులో వీధి వ్యాపారులకు వారి అర్హతను బట్టి 8 పథకాలను అనుసంధానిస్తామన్నారు. ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్సులు, ఫోన్ నెంబరుతో రావాలని పేర్కొన్నారు.

దేశ నిర్మాణంపై ఎన్‌సీసీ క్యాడెట్లలో బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న కల్నల్ అగర్వాల్

» కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ అగర్వాల్
» దివాన్‌చెరువులో ప్రత్యేక జాతీయ సమగ్రత శిబిరం

దివాన్‌చెరువు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సమాజ జీవనం ద్వారా ఎన్‌సీసీ క్యాడెట్ల దేశనిర్మాణం పట్ల ఐక్యతను, బాధ్యతను పెంపొందించుకుంటారని కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ ఆర్‌ఎం అగర్వాల్ అన్నారు. ప్రత్యేక జాతీయ సమగ్రత శిబిరం రాజానగరం మండలం దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో 3వ ఆంధ్ర బాలికల ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ హెచ్‌ఎస్ మానిక్‌తో కలసి ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ఆధ్వర్యంలో కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ ప్రధాన కార్యాలయం ప్రతిష్టాత్మకంగా ఈ పాన్ ఇండియా ఎన్‌సీసీ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ శిబిరంలో ఆటల పోటీలు, వ్యక్తిగత, సమూహ పోటీలు, విద్యాపర్యటనలు, ప్రేరణాత్మక ఉపన్యాసాలు, సామాజిక సేవార్యాలీలు వంటి కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యకలాపాలు క్యాడెట్లలో నాయకత్వం, క్రమశిక్షణ, స్నేహాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయన్నారు. కల్నల్ మానిక్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 29 రాష్ర్టాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాల వైవిధ్యాన్ని సూచించే 17 ఎన్‌సీసీ డైరెక్టరేట్‌ల నుంచి ఎంపిక చేసిన 300 మంది క్యాడెట్లు ఈ శిబిరంలో పాల్గొన్నారని చెప్పారు. వీరిలో ఏపీ నుంచి 26 మంది, తెలంగాణా నుంచి 18 మంది హాజరయ్యారన్నారు. ఈ శిబిరం అక్టోబరు 5 వరకూ జరుగుతుందని పేర్కొన్నారు. కాగా శిబిరంలో భాగంగా విజన్ ఆఫ్ ఇండియా-2050 అనే అంశంపై పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. వివిధ రాష్ర్టాలకు చెందిన క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.


పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న వివిధ రాష్ర్టాల ఎన్‌సీసీ క్యాడెట్లు

కన్నుల పండువగా దుర్గాదేవి గ్రామోత్సవం


బిక్కవోలులో దుర్గాదేవి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

బిక్కవోలు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద నెలకొల్పిన దుర్గామాతకు గురువారం గ్రామోత్సవం జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన గరగ నృత్యాలు, కాళికామాత రాక్షసుడిని సంహరిస్తున్న దృశ్యం అందర్నీ కనువిందు చేసింది. అధిక సంఖ్యలో భవానీలు పాల్గొన్నారు. అలాగే స్థానిక శ్రీరాజరాజేశ్వరి పీఠంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ అవతారంలో అమ్మవార్ని పూజించడం వల్ల వ్యవసాయదారులకు మంచి ఫలసాయంతో పాటు పశు వృద్ధి కలుగుతుందని పీఠాధిపతి దేవరభొట్ల ప్రభాకరశర్మ తెలిపారు. అలాగే గ్రామంలోని ఓంశాంతి ఆశ్రమంలో చిన్నారులు వేసిన నవదుర్గ వేషధారణలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మకుమారీలు లక్ష్మి, భాగ్యం తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధం దేవీచౌక్‌లో దుర్గమ్మకు గ్రామానికి చెందిన భూషంశెట్టి నాగేశ్వరారావు, సరస్వతి దంపతులు బంగారు చెవి కమ్మలను బహూకరించారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.


అమ్మవారికి చెవికమ్మలు బహూకరిస్తున్న భక్తులు

అనపర్తి: శరన్నవ రాత్రుల్లో భాగంగా దుర్గాదేవి కాత్యాయినీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక త్రిశక్తి పీఠం, మహాలక్ష్మి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఓం శక్తి సత్సంగం ఆధ్వర్యంలో భవానీ దీక్షాధారులు గ్రామంలో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.

300మంది మహిళలతో కలశ ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కోరుకొండ రోడ్డులో శ్రీకనకదుర్గ సాయి మందిరం వద్ద 300 మంది మహిళలు కలశ ప్రదర్శన చేశారు. మహిళలు ఎరుపు చీరలు ధరించి, గరగ నృత్యాలు, శక్తి వేషధారణల నడుమ ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విచ్చేసి అమ్మ వారిని దర్శించుకుని, ప్రదర్శనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు జేవీవీ సుబ్బారావు శ్రీదేవి దంపతులు, కంటిపూడి శ్రీనివాస్,దుద్దుపూడి శ్రీనివాస్, పద్మావతి, బి.వెంకటేశ్వరరావు, జొన్నాడ దుర్గ, జొన్నాడ భజేనారాయణ, చంద్ర సప్లయి కంపెనీ ప్రసాద్, ఎన్.సత్యనారాయణ, వేమురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు తరలిన యూటీఎఫ్ నాయకులు

బిక్కవోలు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని యూటీఎఫ్ నేతలు కార్యకర్తలు గుంటూరులో నిర్వహిస్తున్న రణభేరి బహిరంగ సభకు గురువారం తెల్లవారుజామున బయలుదేరి వెళ్లారు. ఆర్థిక, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా బైక్ జాతా నిర్వహించారు. అయితే ప్రభుత్వం స్పందించకపోవడంతో గుంటూరులో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. బిక్కవోలు మండలం నుంచి 15 మంది యూటీఎఫ్ నేతలు, కార్యకర్తలు ఈ సభకు వెళ్లారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్

కడియం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పొట్టిలంక, కడియపుసావరం గ్రామాల్లో డాక్టర్లు ఎం.మణిజ్యోత్స్న, ఎం.జెస్సీసుప్రియ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. కడియపుసావరంలో 152, పొట్టిలంకలో 153 మందికి సేవలందించారు.కార్యక్రమంలో సర్పంచ్‌లు కొత్తపల్లి సత్యవతి, చెక్కపల్లి మురళీకృష్ణ, ఎంపీటీసీలు కలిదిండి విశాలాక్షి, సాపిరెడ్డి వీరదుర్గ, నాయకులు ఆకుల శ్రీధర్,కొత్తపల్లి శ్రీరామ్, బొర్సు సుబ్రహ్మణ్యం, వరగోగుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 132 మంది మహిళలకు వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేసినట్టు డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలోని నెం 1,3 సచివాలయ పరిధిలో పలువురికి రామవరం పీహెచ్‌సీ డాక్టర్ ఈషా జ్యోతి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే కిశోర బాలికలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. సొసైటీ అధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి,ఎన్ఆర్‌కే ప్రసాదరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బూరుగుపూడిలో స్వచ్ఛ భారత్

కోరుకొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బూరుగుపూడి పంచాయతీ పరిధిలో గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రభుత్వ స్థలాల వద్ద పేరుకుపోయిన చెత్తను, పిచ్చిమొక్కలు తొలగించారు. గ్రామమంతా వీధులు ఊడ్చి బ్లీచింగ్ చల్లారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి కార్యక్రమం స్థానిక జిత్ మోహన్ మిత్ర కళావేదికలో గురువారం సాయంత్రం జరిగింది.బాలు చిత్రపటానికి జిత్ మోహన్ మిత్ర పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీపాద మిత్ర మాట్లాడుత ప్రపంచం గర్వించదగ్గ గాయకుల్లో బాలు ఒకరని అన్నారు. ఆయనతో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. మిత్ర ఆర్కెస్ట్రా గాయనీగాయకులు పలు బాలు పాటలు పాడి స్వరనివాళులర్పించారు. కార్యక్రమంలో వంక బాలకృష్ణ, గిరిజాల సోమరాజునాయుడు, ఆదిత్య, ఎన్‌సీ రమేష్, హేమానళిని, కృష్ణ, ఎ.కృష్ణ పాల్గొన్నారు.

కడియం: మండలంలోని వేమగిరిలో ఎన్టీఆర్,ఘంటసాల అభిమాని ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సైనికుడు బొర్రా సుబ్బారావు, సాయిరామ్ ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టులకు ఎనలేని ప్రాధాన్యం

జేఎన్‌టీయూ కాకినాడ ప్రొఫెసర్ శ్రీనివాస్



కొత్తపల్లిలో ప్రొఫెసర్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

గోకవరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఫార్మసిస్టులకు ఎనలేని ప్రాధాన్యముందని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ సమయమంతల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ ఫార్మసిస్ట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు శ్రీనివాస్ విచ్చేసి మాట్లాడారు. కళాశాల చైర్మన్ కనకరాజు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకి మొట్ట మొదటి ప్రైవేట్ ఫార్మసీ కాలేజీ ఆదర్శ కళాశాలేనని అన్నారు. అనంతరం ఫార్మసిస్ట్ డే సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. తదుపరి ఆయనను కళాశాల యాజమాన్యం సత్కరించారు. అలాగే గ్రామంలో విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ పి.నాగమణి, కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: దివాన్‌చెరువులోని వీజే ఫార్మసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. కరస్పాండెంట్ ఎన్‌వీవీ జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఔషధాలను సురక్షితంగా ఏవిధంగా ఉపయోగించాలో ఫార్మసిస్టులు తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.నరేంద్ర డీన్ కె.శ్రీనివాస్, చైర్‌సర్సన్ ఎన్.శకుంతల, విభాగాధిపతి ఎం.లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విజ్ఞానంపై పుస్తకం ఆవిష్కరణ

దివాన్‌చెరువు, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాచీన విజ్ఞాన పరిరక్షణ, భవిష్యత్ తరాలకు చేర్చడం అనే అంశంపై జరిగిన సెమినార్‌కు సంబంధించిన పరిశోధనా పత్రాలతో చక్కని పుస్తకం ప్రచురించారని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గతనెలలో విద్యా కళాశాల ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌కు సంబంధించిన పుస్తకాన్ని వీసీ గురువారం ఆవిష్కరించారు.. ఈ పుస్తకంలో 46 పరిశోధన పత్రాలతో గిరిజన విజ్ఞానంపై చక్కని ఆర్టికల్స్ వచ్చాయన్నారు. క్యాక్రమంలో యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, విద్యాకళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ స్టాంప్స్ ఐజీని కలిసిన ఎమ్మెల్యే నల్లమిల్లి



అనపర్తి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ స్టాంప్స్ డిపార్ట్‌మెంట్‌లో కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించిన బీఆర్ అంబేడ్కర్‌కు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం తాడేపల్లిలోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

భాస్కర్‌నగర్‌పై ఆర్డీవో సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం భాస్కర్‌నగర్ లేఅవుట్లకు సంబంధించిన అంశాలపై రాజమండ్రి పబ్లిక్ సర్వెంట్స్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటి హైలెవెల్ కమిటీతో ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ సమావేశం నిర్వహించారు. గురువారం తన ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో హైలెవెల్ కమిటీలో ఉన్న జిల్లా సహకార అధికారి, జిల్లా రిజిస్ట్రార్, తహశీల్దార్, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమయ్యారు. భాస్కర్‌నగర్‌లో మొత్తం 278 ప్లాట్లలో 135 ప్లాట్లను ఒరిజినల్స్‌గా గుర్తించారు. మిగిలిన ప్లాట్లకు సంబంధించిన రికార్డులలో అవకతవకలు ఉన్నట్టు నిర్ధారించారు. వాటిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. తదుపరి చర్యల నిమిత్తం నివేదికను కలెక్టర్‌కు సమర్పించాలని ఆర్డీవో స్పష్టం చేశారు.

మన డబ్బులు-మన లెక్కలుపై అవగాహన

రాజానగరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయ సంఘాల సభ్యుల ఆర్థిక లావాదేవీలపై మాటిమాటికి బ్యాంకులకు వెళ్లాల్సిన పనిలేకుండా ఉండేలా మన డబ్బులు-మన లెక్కలు యాప్ ఎంతగానో దోహదపడుతుందని సెర్ప్ ఏపీఎం గుమ్మడి సునీత అన్నారు. మండలంలో చక్రద్వారబంధంలో మన డబ్బులు-మన లెక్కలు, ఎంబీకేపై డ్వాక్రా సంఘాలతో కలిసి గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీఎం మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లోని ప్రతి మహిళ బ్యాంకుల్లో కడుతున్న పొదుపు, అప్పులు, బకాయిలు, ఆదాయ, వ్యయాలపై సమగ్ర సమాచారం యాప్‌లో తెలుసుకోవచ్చన్నారు. ఇందుకు డ్వాక్రా సంఘాల మహిళలు ఎంబీకే 2.0లో నమోదవ్వాలన్నారు. సంఘాల్లో వారి ఆర్థిక లావాదేవీలపై సంపూర్ణ అవగాహన కలుగుతుందన్నారు. సంఘాల్లో జరుగుతున్న రుణాలు, చెల్లింపులు, బ్యాంకు వారి ఖాతాల ద్వారా సరిచూసుకునే వీలుంటుందన్నారు.ప్రతి 10 సంఘాలకు ఒక ఈ-నారీని గుర్తించి,వారికి సీసీల ద్వారా శిక్షణ కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలకు కార్పొరేట్ కళాశాలలు తూట్లు

బీజేపీ కోరుకొండ అధ్యక్షుడు సుధీర్

కోరుకొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నాయని బీజేపీ మండలాధ్యక్షుడు అడపా సుధీర్ అన్నారు.గురువారం ఆయన స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో కుశలవ దొరను కలిశారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు దసరా సెలవులు ప్రకటించినా ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు తరగతులను నిర్వహిస్తున్నాయని అన్నారు. అలాగే ప్రభుత్వ నిబంధనలను తుంగలోతొక్కి విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. ఈ విషయాలు విద్యాశాఖాధికారులకు తెలిసినా ఆయా కళాశాలలపై చర్యలు తీసుకోవడంలేదని సుధీర్ ఆరోపించారు.

నగరంలో టీడీపీ పటిష్టతకు కృషి : రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని 42వ డివిజన్లలో టీడీపీని మరింతగా పటిష్ఠ పరిచి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పార్టీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడూ టీడీపీ కష్టకాలంలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేసిన వారందరికీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పలు కమిటీలో చోటు కల్పించారని, అందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అన్నింటిలోను సామాజిక సమతుల్యం పాటించారని చెప్పారు. తమ కమిటీ నగరంలో ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకిరామయ్య, కంటిపూడి శ్రీనివాస్, కరగాని వేణు, మొకమాటి సత్యనారాయణ, కడలి రామకృష్ణ, ద్వారా పార్వతిసుందరి తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు.. కేసులకు భయపడం

మాజీ మంత్రి మేరుగ నాగార్జున

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అరెస్టులు, కేసులకు భయపడే వాళ్లు వైసీపీలో లేరని.. ఏపీలో రాజ్యాంగం అపహాస్యమవుతోందని మాజీ మంత్రి మేరుగ నాగార్జున విమర్శించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎంపీ మిథున్ రెడ్డిని ములాఖత్ ద్వారా నాగార్జున, కురసాల కన్నబాబు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కలిశారు. అనంతరం నాగార్జున మాట్లాడుతూ కుట్రలు, కుతంత్రాలతో రాష్ట్రంలో పాలన జరుగుతోందన్నారు. సుదీర్ఘ అనుభవం ఉందని చెప్పుకొనే ముఖ్యమంత్రి.. పగ్గాలను పిల్లల చేతిలో పెట్టడంతో పిల్లచేష్టలు చేస్తున్నారన్నారు.కన్నబాబు మాట్లాడుతూ చంద్రబాబు కక్ష సాధించాలనే జాబితాలో తన కుటుంబం ఉంటుందని మిథున్ ముందుగానే చెప్పేవారన్నారు. రెడ్‌బుక్ గురించి లోకేశ్ ఎప్పుడో ఊరూవాడా తిరిగి చెప్పారని, దానికి అనుగుణంగానే ఇప్పుడు పరిస్థితులు ఉన్నాయన్నారు. వేగులను పంపించి టీడీపీ కార్యకర్తల ఉద్దేశాలను తెలుసుకోవాలని సూచించారు. తప్పుదారిలో పరిపాలన వెళుతోందనే భావన టీడీపీ నాయకుల్లో ఉందన్నారు. అసెంబ్లీలో పరిస్థితులే దానిని స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. ఇప్పటికైనా చంద్రబాబు ఆత్మపరిశీలన చేసుకుంటే రాష్ట్రానికి మంచి జరుగుతుందని కన్నబాబు అన్నారు.

పండిట్ దీన దయాళ్‌కు ఘన నివాళులు

అనపర్తి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అంత్యోదయ, ఏకాత్మ మానవవాద సిద్ధాంత రూపకర్త పండిట్ దీన దయాళ్ జయంతిని గురువారం అనపర్తిలోని కూటమి కార్యాలయంలో నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కర్రి బులిరెడ్డి నేతృత్వంలో నాయకులు దీనదయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నల్లమిల్లి సుబ్బారెడ్డి, మల్లిడి సురేంద్రరెడ్డి, గిరిడా గంగాభవాని, సత్తి వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులో పండిట్ దీనదయాల్ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండలాధ్యక్షుడు దుర్గారెడ్డి, ఓవీ కృష్ణ, సరెళ్ల సుమలత, వడ్లమూరి లక్ష్మి, పవన్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛోత్సవ్ కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీ జరిపారు. అనంతరం మెయిన్ రోడ్‌ను శుభ్రం చేశారు. ఎంపీడీవో వి.శ్రీనివాస్, ఏవో నాగేంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పద్మజ, సర్పంచ్ సరెళ్ల సుమలత, పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు పాల్గొన్నారు.



కాత్యాయనీ..నమోస్తుతే!





శరణు మాతా శరణు అంటూ భక్తులు అమ్మవార్లను వేడుకుంటున్నారు.. ఎక్కడికక్కడ ప్రత్యేక పూజలు చేస్తున్నారు.. పలు ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు చేస్తున్నారు.. దసరా ఉత్సవాల్లో భాగంగా మహిళలు కలశాలతో ర్యాలీలు చేస్తున్నారు.. రాజమహేంద్రవరం కోరుకొండ వీవర్స్ కాలనీ కనకదుర్గ సాయి మందిరం వద్ద 300 మంది మహిళలు ఎర్రరంగు చీరలు ధరించి కలశాలతో ర్యాలీ చేశారు. చాగల్లు పాటెమ్మపేటలోని పిడుంగొయ్యి వద్ద మహిళలు పసుపు చీరలతో ర్యాలీ చేశారు. తాళ్లపూడి కనకదుర్గ ఆలయంలో కాత్యాయనిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

చీపురు పట్టిన కలెక్టర్



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టర్ చేకూరి కీర్తి రాజమహేంద్రవరం కోటిలింగాల ఘాట్‌కు వచ్చారు.. మెట్లు అపరిశుభ్రంగా ఉండం చూశారు.. వెంటనే చీపురు పట్టారు.. ఇలా శుభ్రం చేశారు. ఆమెకు కార్పొరేషన్ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ జత కలిశారు.. పైనుంచి కింద వరకు మెట్లను శుభ్రం చేశారు. అనంతరం కార్పొరేషన్ సిబ్బందికి కలెక్టర్ పారిశుధ్య మెరుగుదలపై పలు సూచనలు చేశారు. - రాజమహేంద్రవరం సిటీ

6 వే!



4 ఆప్షన్‌కే మొగ్గు..

ఆరులైన్ల విస్తరణకు సంబంధించి డీపీఆర్ నివేదికలో నాలుగు రకాల అలైన్‌మెంట్ ఆప్షన్లు విశ్లేషించారు. ఆప్షన్ 1 ఎంచుకుంటే ఆరులైన్ల విస్తరణకు ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారుగా రూ.2,300 కోట్లు,ఆప్షన్ 2 కింద రూ.4,200 కోట్లు, ఆప్షన్ 3 కింద రూ.6,700 కోట్లు, ఆప్షన్ 4 కింద రూ.6,230 కోట్లు వ్యయం కానున్నట్టు గుర్తించారు.అనకాపల్లి నుంచి దివాన్‌చెరువు కింద 160 కిలో మీటర్ల మేర ఆరు లైన్ల విస్తరణ ఖర్చు ఆప్షన్ 4 అలైన్‌మెంట్‌కు రూ.10,233 కోట్లు వ్యయం కానున్నట్టు అంచనా . ఆప్షన్1 కింద రూ.4,586 కోట్లు, ఆప్షన్2 కింద రూ.7577 కోట్లు, ఆప్షన్ 3 రూ.10,760 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. అధికారులు నాలుగో ఆప్షన్‌కే మొగ్గు చూపుతు న్నారు. దీన్ని ఎంపిక చేస్తే ఇబ్బందుల్లేకుండా ప్రాజెక్టు పట్టాలెక్కించవచ్చని భావిస్తున్నారు. అలైన్‌మెంట్ ఆప్షన్లపై స్టేక్ హోల్డర్ల సమావేశాల్లో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీని ప్రకారం కేంద్రానికి ఎన్‌హెచ్ అధికారులు నివేదిక పంపుతారు. దీన్ని పరిశీలించిన తర్వాత కేంద్రం ఏ అలైన్ మెంట్‌కు ఆమోదముద్ర వేస్తుందనేది చూడాలి. ఈ ప్రక్రియ పూర్తిచేసుకుని హైవే విస్తరణకు టెండర్లు పిలవడానికి మరికొంత సమయం పట్టనుంది.

తుని-దివాన్‌చెరువు మధ్య ఆరులేన్లుగా హైవే

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లామీదుగా ప్రయాణించే చెన్నై-కోల్‌కతా 16వ నెంబరు జాతీయరహదారికి ఎట్టకేలకు మంచిరోజులు వచ్చాయి. ఎన్నాళ్లగానో ఎదురుచూస్తోన్న ఆరు వరుసల హైవే విస్తరణకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుత నాలుగు లైన్ల హైవే అత్యంత రద్దీగా మారడం..బ్లాక్‌స్పాట్‌లు అధికమై తరచూ ప్రమాదాలకు నిలయంగా మారడంతో ఆరులైన్లకు విస్తరించేందుకు ఎన్‌హెచ్ అధికారులు శ్రీకారం చుట్టారు.ఈ మేరకు హైవే విస్తరణకు సంబంధించి తాజాగా డీపీఆర్ సిద్ధమైంది. కాకినాడ జిల్లా తుని నుంచి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని దివాన్ చెరువు జంక్షన్ వరకు మొత్తం 91 కి.మీ. మేర విస్తరణకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. విస్తరణ ప్రాజెక్టులో ఆప్షన్1 అలైన్‌మెంట్ ఖర్చు రూ.2,500 కోట్లు అవుతుండగా..ఆప్షన్4 కింద ఖర్చు రూ.6,230 కోట్ల వరకు వ్యయం కానుంది. విస్తరణకు సంబంధించి 8 చోట్ల ఫ్లయ్ ఓవర్లు నిర్మించనున్నారు. అయితే హైవే వెంబడి అనేక గ్రామాలు ఉన్నందున కొన్ని చోట్ల బైపాస్ ప్రతిపాదించారు. ప్రాజెక్టు వ్యయం ఎక్కువే అయినా నాలుగో ఆప్షన్‌కే అధికారులు మొగ్గుచూపుతున్నారు. దీన్ని కేంద్రం పరిశీలించి ఆమోదించిన తర్వాత విస్తరణ పనులకు టెండర్లు పిలవనున్నారు.

ఆరు లేన్లకు ఇదే కారణం..

కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల మీదుగా ప్రయాణించే చెన్నై-కోల్‌కతా 16వ నెంబరు జాతీయరహదారి నిర్మించి దాదాపు పాతికేళ్లపైనే అవుతోంది. ప్రస్తుతం ఉన్న నాలుగు లైన్ల హైవే పూర్తిగా రద్దీగా మారిపోయింది. రహదారిని నిర్మించినప్పుడు అంచనా వేసిన పీక్ ట్రాఫిక్ స్థాయి దాటి వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. తుని నుంచి దివాన్‌చెరువు వరకు ఉన్న హైవే పరిధిలో ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్‌స్పాట్‌ల సంఖ్య విపరీతంగా పెరిగిపో యింది.ఈ నేపథ్యంలో ప్రస్తుత హైవేను ఆరులైన్లుగా విస్తరించాలనే ప్రతిపాదన ఎన్నో ఏళ్లగా ఉంది. అయితే నాలుగు లైన్ల వెంబడి తుని నుంచి దివాన్‌చెరువు వరకు అనేక గ్రామాలు,పట్టణాలు విస్తరించి భారీ వాణిజ్య భవనాలు వెలిశాయి. దీంతో ఆరు లైన్లను ఎలా విస్తరించాలనే దానిపై అధ్యయనం చేసి నివేదిక సిద్ధం చేసే బాధ్యత ఆర్కిటెక్స్, ధృవ్ కన్సల్టెన్సీలకు అప్పగించింది.

హైవే విస్తరణ ఇలా..

విస్తరణకు సంబంధించి కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో తుని, శంఖవరం, తొండంగి, గొల్లప్రోలు,ప్రత్తిపాడు, జగ్గంపేట, ఏలేశ్వరం,గండేపల్లి మండలాల పరిధిలోని తుని, చేపూరు, తేటగుంట,అరెంపూడి, పీతల చిన్నయ్య పాలెం,సీతాయంపేట,ప్రత్తిపాడు,జగపతినగరం, సోమవరం,బూరుగుపూడి, రామవరం, రాగంపేట,తాళ్లూరు, బొర్రంపాలెం, మల్లేపల్లి, గండేపల్లి, మురారి, కల్వచర్ల, రాజానగరం, జగన్నాథపురం, వెంకటపురం, నరేంద్రపురం, వెలుగుబంద గ్రామాల మీదుగా కొత్త లైన్ల వరుస నిర్మాణం జరగనుంది. కాకినాడ జిల్లా పరిధిలో తాండవ నది, అన్నవరం బైపాస్, ఎర్ర కాలువ వద్ద మూడు బ్రిడ్జిలు ప్రతిపాదించారు. తుని పరిధిలోని తిమ్మాపురంలో రైల్వే లైన్ నేప థ్యంలో ఆర్వోబీ ప్రతిపాదించారు. తూర్పుగోదా వరి జిల్లా పరిధిలో కాకినాడ ఏడీబీ రోడ్డు, కోరుకొండ, రాజానగరంతో పాటు కాకినాడ జిల్లాలో 11 చోట్ల మేజర్ క్రాసింగ్‌లు గుర్తించారు. కాకినాడ జిల్లా పరిధిలో చేపూరు, ఎర్రవరం, బూరుగుపూడి,రామవరం, తాళ్లూరు, మల్లేపల్లి,గండేపల్లి,మురారి తదితర చోట్ల 8 ఫ్లయ్ ఓవర్లు నిర్మించాల్సి ఉంటుందని ప్రతిపా దించారు. తేటగుంట,దివాన్‌చెరువు పరిధిలో మూడు కిలో మీటర్ల మేర రిజర్వ్‌ఫారెస్ట్ మీదుగా రహదారి నిర్మించాల్సి ఉంటుందని గుర్తించారు.

- ప్రస్తుతం నాలుగు లేన్లు
- ఆరులేన్లుగా డీపీఆర్ సిద్ధం
- 4 రకాల అలైన్‌మెంట్ ఆప్షన్లు
- కాకినాడ జిల్లాలో 80 కి.మీ
- తూ.గో. జిల్లాలో 11 కి.మీ
- వ్యయం రూ.6,230 కోట్లు
- 8 చోట్ల ఫ్లయ్ ఓవర్లు
- 3 చోట్ల బ్రిడ్జిలు
- 14 చోట్ల మేజర్ క్రాసింగ్‌లు
- త్వరలో కేంద్రం టెండర్లు

దాదాపు రెండున్నరేళ్ల ఈ సంస్థలు అధ్యయనం చేసి ఎట్టకేలకు నాలుగు రకాల అలైన్‌మెంట్ ఆప్షన్లతో డీపీఆర్ సిద్ధం చేశాయి. కాకినాడ జిల్లాలో 80 కిలోమీటర్లు, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 11 కి.మీ.మేర ఆరులైన్ల విస్తరణ పనులు చేపట్టాలంటే ఒక్కో ఆప్షన్ కింద ఎంత వ్యయం అవుతుందో నివేదికలో విశ్లేషించాయి.

జీఎస్టీ తగ్గింపు.. ఏడాదికి రూ.150 కోట్లు లాభం

తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో అంచనా

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జీఎస్‌టి 2.0 వల్ల రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న జీఎస్‌టీ జేసీ పరిధిలోని తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఏడాదికి రూ.120 నుంచి రూ.150 కోట్లు ప్రజలకు కలిసి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.జీఎస్టీ తగ్గింపు వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల కోట్లు లాభం వస్తుందని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. జిల్లాలో పూర్తిస్థాయి అంచనాలు వేయలేదు. సుమారు ఇంత వరకూ లాభం చేకూరుతుందని చెప్పడం గమనార్హం. వాస్తవానికి గురువారం నుంచి వస్తువుల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ముందుగా శాఖలవారీగా ప్రజల్లో వెళుతున్నారు. శుక్ర లేదా శనివారాల నుంచి అవగాహన సదస్సులు నిర్వహించడానికి సమాయత్తం అవుతున్నారు. పోస్టర్లు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం ఆరంభించారు.జీఎస్టీ అధికారులు వివిధ షోరూమ్‌లకు వెళ్లి, వ్యాపారులు, వినియోగదారుల సమక్షంలో అవగాహన కల్పిస్తున్నారు. అన్ని షాపుల వల్ల ధరల వివరాలు పెట్టించే ప్రయత్నం చేస్తున్నారు.వచ్చే నెల 19వ తేదీ లోపు మొత్తం జీఎస్టీ తగ్గింపు అమలు చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారులతో నోడల్ అధికారుల కమిటీలను నియమించారు.సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ ప్రచారం చేయనున్నారు.ఒక యాప్ సిద్ధం చేసి ప్రతి మొబైల్‌లో ఉండేవిధంగా ప్రచారం చేయనున్నారు.కార్లు, మోటారు సైకిళ్లపై కూడా తగ్గడం గమనార్హం. పాల ఉత్పత్తులకు సంబంధించి చిన్న చిన్న దుకాణాల వల్ల పాత,కొత్త ధరల వివరాలు పెడుతున్నారు.కానీ ప్రస్తుతం పాత ధరలకే అమ్మడం గమనార్హం. కొత్తసరుకుతో ఎమ్మార్పీ రేట్లు ముద్రించిన వెంటనే కొత్తధరలకే అమ్ముతామని దుకాణదారులు మోసగిస్తున్నారు.

హౌస్ బోట్లకు గోదావరి అనుకూలం

క్షేత్రస్థాయిలో కేరళ బృందం పర్యటన - కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం,సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గోదావరి ప్రాంతం కేరళ తరహా హౌస్‌బోట్ల నిర్వహణకు అనుకూలంగా ఉందని కేరళ పర్యాటక బృందం స్పష్టం చేసింది. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో జిల్లా అధికారులతో కలిసి గురువారం క్షేత్రస్థాయి పర్యటన చేసింది. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి హౌస్‌బోట్స్, క్రూయిజ్ అభివృద్ధి అంశాలపై హౌస్‌బోట్ల బిల్డర్లు, ఆపరేటర్ల బృందంతో సమీక్షించారు.జిల్లాలో ఇకో టూరిజం, అడ్వంచర్ స్పోర్ట్స్, హేవలాక్ బ్రిడ్జి, టెంపుల టూరిజం, కడియం నర్సరీల ప్రాంతాల్లో టూరిజం అభి వృద్ధికి అవకాశాలు ఉన్నాయన్నారు. పోలవరం,కొవ్వూరు,మునికూడలి, రాజమహేంద్రవరం ఘాట్లలో టెంపుల్ టూరిజంకు ప్రాధాన్యత ఉన్నట్టు చెప్పారు. హౌస్‌బోట్ల బృందం సరస్వతి, పద్మావతి, పుష్కర్‌ఘాట్లు, గోపాద, శివలింగ ఘాట్లు,పిచ్చుకలంక, ధవళేశ్వరం బ్యారేజీ, కడియపులంక నర్సరీలు,పోలవరం ప్రాజెక్టు, సమీప ప్రాంతాల్లో పర్యటించినట్టు తెలిపారు. హౌస్‌బోట్‌ను పైలెట్‌గా ఈ ప్రాంతం నుంచే ప్రారంభించాలని కలెక్టర్ బృందానికి సూచించారు. కేరళ బృందం ప్రతినిధులు మాట్లాడుతూ హౌస్‌బోట్ల ద్వారా జిల్లాకు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందన్నారు.సమావేశంలో రాష్ట్ర పర్యాటక జీఎం నాంచారయ్య, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, ఇరిగేషన్ డీఈ బి.మూర్తిరాజు,కేరళ బృందం పాల్గొన్నారు.

తలుపులు పగలకొట్టి.. వృద్ధురాలిని కొట్టి
నల్లజర్లలో భారీ చోరీ
6
ఉద్యాన పంటలతో అధిక లాభాలు
డాక్టర్ పి.చౌడప్ప



కొత్త మాస్టార్లు గురువారం ఉదయం ఉత్సాహంగా విజయవాడలో సీఎం సభకు తరలి వెళ్లారు.. ఆర్టీసీ బస్సుల్లో 3315 మంది ఉపాధ్యాయులు బయలుదేరారు.. ప్రతి ఒక్కరిలో కొత్త ఉత్సాహం కనిపించింది.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

రంగంపేటలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

రంగంపేట,సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తూర్పుప్రాంత విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు.రంగంపేట విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో గురువారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలపై తాము ఇస్తున్న ఉత్తర్వులను కొందరు పాటించడం లేదని దీనిని తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. న్యాయస్థానం పరిధిలో 11 జిల్లాలు ఉండగా అందులో ఒక్క కాకినాడ జిల్లా మాత్రమే బాగా స్పందిస్తుందన్నారు. న్యాయస్థానం సాంకేతిక సభ్యుడు ఎస్.రాజబాబు మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి సామగ్రి కొరత ఆటంకంగా ఉందన్నారు. జలకళకు సంబంధించి రంగంపేట మండలంలో 30 గొట్టపుబావులకు సమస్య ఉండగా 8 బావుల సమస్య నెల రోజుల్లో పరిష్కారం అవుతుందని సత్యనారాయణ అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

వ్యవసాయ కనెక్షన్ల విషయంలో రంగంపేటకు ప్రాధాన్యత ఇవ్వాలని మర్రిపూడి రైతు పుట్టా సోమన్న చౌదరి విజ్ఞప్తి చేశారు. రంగంపేటకు చెందిన ఉండవిల్లి గిరిబాబు, బి.దుర్గారావు, పెదరాయవరానికి చెందిన మోదుకూరి గోపాలకృష్ణ పలు సమస్యలు విన్నవించారు. విద్యుత్ వినియోగదారులు 53 ఫిర్యాదులు అందజేశారు.ఈ సమస్యల పరిష్కరిస్తామని విద్యుత్ ఈఈ నటరాజన్,ఏఈ టి.శిరీష హామీ ఇచ్చారు. సభ్యులు ఎస్.సుబ్బారావు, ఎస్.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ కోర్టులో తలపడుతున్న క్రీడాకారులు

క్రీడలకు కేరాఫ్ రాజమహేంద్రి

ఆలిండియా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆరంభంలో కలెక్టర్ కీర్తి

- 1300 మంది క్రీడాకారుల హాజరు
- 28న ముగింపు




ఆడుతున్న కలెక్టర్, ఎస్పీ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక రాజధానిగా ఉన్న రాజమహేంద్రవరం రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల నిర్వహణకు కేరాఫ్‌గా మారుతోందని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. జాతీయ బ్యాడ్మింటన్ అసోసియేషన్, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నారాయణపురంలోని నగరపాలక సంస్థ బ్యాడ్మింటన్ కోర్టులో గురువారం ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ - 2025 ప్రారంభించి మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు గెలుపు ఓటములను సమంగా తీసుకోవాలన్నారు.సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా రాజమహేంద్రవరాన్ని క్రీడాహబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. గతేడాది ఇంటర్‌స్టేట్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించగా, ఈ సారి జాతీయస్థాయిలో ర్యాంకింగ్ టోర్నమెంట్ జరగడం శుభపరిణామమన్నారు. ఖేలో ఇండియా టోర్నమెంట్‌ను రాజమహేంద్రవరంలో నిర్వహించాలని కోరతామన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన ఇన్‌ఛార్జి అనుశ్రీ సత్యనారాయణ ఒక టీమ్‌గా, కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహ కిషోర్ మరో టీమ్‌గా కాసేపు బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 1300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ నెల 28వ తేదీన టోర్నమెంట్ ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి అంకన్నచౌదరి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నాయకులు, వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు.



ఆడేస్తున్న క్రీడాకారిణి



గాలిలో ఎగిరి షాట్ కొడుతున్న బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

శబరిమలకు బస్‌లు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో పంచారామ క్షేత్రాలు, శబరిమల యాత్రకు ప్రత్యేక బస్సులు బస్సులు నడుపుతామని ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు.ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరంలోని డీపీటీవో కార్యాలయంలో పోస్టర్లు, కరపత్రాలు డిపో అధికారులతో కలిసి విడుదల చేసి మాట్లాడారు. కార్తీక సోమవారాల్లో పంచారామ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటకు బస్సులు ప్రతి ఆదివారం సాయంత్రం 7 గంటలకు రాజమండ్రి డిపో నుంచి బయలుదేరి సోమవారం రాత్రి 10 గంటలకు తిరిగి డిపోకు చేరతాయన్నారు. శబరిమల 10 రోజుల యాత్రలో బెజవాడ, శ్రీశైలం, మహానంది, కాణిపాకం,అరుణాచలం, పళని, పంబ, త్రివేండ్రం,కన్యాకుమారి, తిరుచందూరు,రామేశ్వరం, మధురై, తిరుపతి, శ్రీకాళహస్తి క్షేత్రాలు దర్శించుకోవచ్చన్నారు.శబరిమలకు ఐదు, ఏడు రోజుల యాత్ర ఉందన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 9 మందికి జైలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 9 మందికి కోర్టు జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ సీఐ ఎండీ అబ్దుల్ నబీ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే ఉద్దేశంతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌ని రోజూ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 60 కేసులు నమోదు చేశారు. నిందితుల్లో 51 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా, ఆరుగురికి రెండు రోజులు, ముగ్గురికి మూడు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ జడ్జి సి.రమ్య ఆదేశాలిచ్చారని సీఐ పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు.

గుంటూరు తరలిన యూటీఎఫ్ నేతలు


సభలో పాల్గొన్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు

కొవ్వూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఆర్.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గుంటూరులో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభకు కొవ్వూరు నుంచి ఎండీ ఇమ్రాన్‌బాషా, పీ.రవికుమార్, పీ.రమేష్, కే.ఏడుకొండలు, శ్రీనివాస్, మహేష్, మరో 50 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏను తక్షణం చెల్లించాలని, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గద్దె దిగాలి


నిడదవోలులో దిష్టిబొమ్మలకు శవయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

నిడదవోలు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అప్రజాస్వామికంగా అధికారం పొందిన బీజేపీ గద్దె దిగాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర అన్నారు. గురువారం నిడదవోలు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ, ఎలక్షన్ కమిషన్ దిష్టిబొమ్మలకు శవయాత్రలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ బీజేపీ, ఎలక్షన్ కమిషన్ కుమ్మక్కై పాలన సాగిస్తున్నారని, భవిష్యత్తులో భారతదేశం తల దించుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, మహ్మద్ అమర్ జహా బేగం, కాకర్ల శ్రీహరిబాబు, చిన్నం మురళీకృష్ణ, పుల్లారావు, శారద, బాబీ పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి


నిడదవోలులో నివాళి అర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

నిడదవోలు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి దీన్ దయాళ్ ఉపాధ్యాయ అందించిన సేవలు ఎంతో విలువైనవని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మోర్త ప్రమోద్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని బీజేపీ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టంగుటూరి శ్రీనివాస్, అరిగెల శ్రీనివాస్, నిడమర్తి భాస్కరరావు, నిడమర్తి రామచంద్రరావు, గొన్నాబత్తుల విజయ్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి మెయిన్ రోడ్డులోని


తాళ్లపూడిలో దీన దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నేతలు

పాత ఎస్‌బీఐ ఏటీఎం సెంటరు వద్ద బీజేపీ మండలా ధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ ఆధ్వర్యంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామకృష్ణ మాట్లా డుతూ దీనదయాళ్ ఉపాధ్యాయ 1916లో ఉత్తరప్రదేశ్‌లోని నాగ్ల చంద్రబాన్ అనే గ్రామంలో జన్మించారన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడిగా పని చేశారన్నారు.కార్యక్రమంలో గోకవరపు జితేంద్ర రవి, బూసి సురేంద్రనాథ్ బెనర్జీ, బోర్రా శ్రీరామ్మూర్తి, వెలుగుబంటి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు రెండోదశ నోటిఫికేషన్

● ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జే.సునీత

కొవ్వూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు 2వ దశ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జే.సునీత తెలిపారు. కళాశాలలో బీఏ హిస్టరీ, బీకామ్ కంప్యూటర్స్, బీకామ్ జనరల్, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి 29 వరకు కళాశాల కార్యాలయంలో విద్యార్థులు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. ఈనెల 29వ తేదీ నుంచి అక్టోబరు 1 వరకు వెబ్‌ఆప్షన్‌లో ఎంపిక జరుగుతుందన్నారు. అక్టోబరు 3వ తేదీన వెబ్‌ఆప్షన్‌లో మార్పులు చేసుకోవచ్చునన్నారు. 6వ తేదీన సీట్ల కేటాయింపు, 7వ తేదీన విద్యార్థులు కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు.

అభిమానుల సంబరాలు

కొవ్వూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, హీరో పవన్ కల్యాణ్ నటించిన ఓజీ సినిమా సూపర్‌హిట్ కావడంతో చిరంజీవి అభిమానులు కొవ్వూరులో గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా యువరాజ్ మల్టీప్లెక్స్‌లో అధినేత దుద్దుపూడి రామచంద్రరావు కేక్ కట్ చేశారు. చిరంజీవి యువత పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత కొవ్వూరే లక్ష్యం

● మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ● గోష్పాదక్షేత్రంలో స్వచ్ఛభారత్ నిర్వహణ


గోష్పాదక్షేత్రంలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత కొవ్వూరే లక్ష్యమని, దీనికి ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. గురువారం స్థానిక గోష్పాదక్షేత్రంలో మున్సిపల్ కమిషనర్ జీ.సందీప్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందరంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతా పకోత్సవాలు ముగింపును పురస్కరించుకుని ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు ఏఎన్ఎంలు గోష్పాదక్షేత్రంలో శ్రమదానం చేశారన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుంచి 25 వరకు పట్టణంలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన ప్రతి కార్యక్రమంలో ప్రజలు, నాయకులను భాగస్వాములను చేసి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: పర్యావరణ పరిశుభ్రత అందరి బాధ్యతని మునిసిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి అన్నారు. గురువారం పట్టణంలో మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వీక్లీ మార్కెట్‌లో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అక్టోబరు 2వ తేదీ వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పచ్చదనం పరిరక్షణ పరిశుభ్రత పరిరక్షణపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వజీరుద్దీన్, కౌన్సిలర్లు జాన్‌బాబు, దాకేఅనిల్, మునిసిపల్ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


నిడదవోలులో శ్రమదానం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సమగ్ర సస్యరక్షణపై శిక్షణ


కానూరులో రైతులకు పలు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

పెరవలి,సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం విజయవాడ వారి ఆధ్వర్యంలో రైతులకు గురువారం కానూరులో శిక్షణ ప్రారంభించారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ సహకారంతో వివిధ పంటల్లో తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రెండురోజుల పాటు శిక్షణ ఉంటుంది. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా వరి, అరటి, కొబ్బరి, ఖోఖో పంటల్లో అనుసరించాల్సిన వివిధ యాజమాన్య పద్ధతుల గురించి పురుగులు, తెగుళ్ల గుర్తింపు, పోషకలోపాలు గుర్తింపు, తదితర వాటి గురించి శాస్త్రవేత్తలు వివరించారు. విజయవాడకు చెందిన ఎం. గోస్వామి, కే. వీరయ్యచౌదరి, అనిల్ కుమార్, బీ. బాబు, జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మాధవరావు, ఏడీ జే.శ్రీనివాస్, ఏవో ఏ. మేరీకిరణ్, మార్టేరు పరిశోధనా స్థానం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టీ. శ్రీనివాస్, డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ అహ్మద్, ఉద్యాన వన సలహాదారు బీ. శ్రీధర్ పాల్గొన్నారు.

ఉద్యాన వన పంటలతో అధిక లాభాలు

● డాక్టర్ పీ. చౌడప్ప


తాడిపర్రులో కోకో రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ చౌడప్ప

ఉంగ్రాజవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన పంటలతో అధిక లాభాలు పొందవచ్చని సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ పీ. చౌడప్ప పేర్కొన్నారు. గురువారం తాడిపర్రు, కే. సావరంలోని కోకో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. కోకో పంటలో కొబ్బరి, పామాయిల్, వక్క పంటలను అంతర పంటగా వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు హార్టికల్చర్ అధికారులు డీ. సుధీర్‌కుమార్, వేణుమాధవ్, రైతులు, సచివాలయ హార్టికల్చర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: కొబ్బరి, పామాయిల్ వంటి ఉద్యాన పంటలతో అధిక ఆదాయం పొందవచ్చునని ఉద్యానశాఖ ఏడీ డీ. సుధీర్ కుమార్ అన్నారు. గురువారం కలవలపల్లిలో రైతు ముళ్లపూడి మురళీకృష్ణ పామాయిల్ తోటలోని అంతరపంటగా వేసిన కోకో, మిరియాలు, జాజికాయ, దాల్చిన చెక్క సాగును ఉద్యానవన అధికారులు పరిశీలించారు. సీపీసీఆర్‌ఐ రిటైర్డ్ డైరెక్టర్ చౌడప్ప పాల్గొని మిగిలిన రైతులు వీటిని ఆద ర్శంగా తీసుకుని వ్యవసాయం లాభసాటిగా చేసుకోవాలన్నారు. మాండిలైజ్ కంపెనీ ప్రతినిధులు, ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ అనుబంధ సంఘాలు ఏర్పాటు

నల్లజర్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అనుబంధ సంఘాల కూర్పును ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పూర్తి చేశారు. ఇందులో సాంస్కృతిక శాఖ మండలాధ్యక్షుడిగా ప్రత్తిపాటి గంగారావు (అచ్చన్నపాలెం) ప్రధాన కార్యదర్శిగా ప్రత్తిపాటి రాంబాబు (చీపురుగూడెం) ఉపాధ్యక్షుడిగా గన్నిన సుబ్బారావు (నల్లజర్ల), కార్యనిర్వహణ కార్యదర్శిగా పాము నాగదుర్గ (జగన్నాథపురం) కార్యదర్శిగా తవ్వా నరసింహా రావు (నబీపేట) ఉన్నారు. అలాగే తెలుగు యువత మండలాధ్య క్షుడిగా బేతిన అనిల్ (కవులూరు), ఎస్సీ సెల్ మండలాధ్యక్షు డిగా మల్లిపూడి కృష్ణారావు (నల్లజర్ల), మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడిగా షేక్‌రజాక్ ఎంపికయ్యారు. నూతన సభ్యులను ఎమ్మెల్యే ప్రకాశరావుపాలెంలో బుధవారం రాత్రి కలిసి అభినందించారు. పార్టీకి మరింత సేవలందించి గ్రామస్థాయిలో మంచి పేరు తీసుకురావాలన్నారు.

కోటసత్తెమకు విశేష పూజలు



నిడదవోలు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజు పాలెంలో వేంచేసి ఉన్న కోట సత్తెమ్మ వారి దేవస్థానంలో దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం నాలుగో రోజు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యాభిషేకం, ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజలు, చండీ పారాయణం, సాయంకాలం హోమాన్ని నిర్వహించారు. ప్రత్యేక కుంకుమ పూజలో సుమారు 227 మంది దంపతులు పాల్గొన్నాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని తీర్థప్రసాదాన్ని స్వీకరించారు.

కాత్యాయనీ అలంకరణలో అమ్మవారు

● మహిళల విశేష పూజలు


కొవ్వూరులో..


గోపాలపురంలో..

కొవ్వూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి అమ్మవారిని కాత్యాయని అలంకరణ చేసి విశేషపూజలు అందించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నాల్గోరోజుకి చేరుకున్నాయి. అర్చకులు కొండూరి మణికిరణ్ ఆధ్వర్యంలో తిప్పాట్ల సుబ్రహ్మణ్యం దంపతులు చండీహోమాన్ని జరిపించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలో నవదుర్గా పరివార సహిత కనకదుర్గా ఆలయంలో నాలుగో రోజైన గురువారం అమ్మవారు కాత్యాయనీ దేవి రూపంలో దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. గాయత్రీమాత ఆలయంలో అమ్మవారికి పసుపు కొమ్ములతో గజమాలను చేసి అలంకరించారు.

చాగల్లు : మండల కేంద్రమైన చాగల్లు పాటెమ్మపేటలోని పిండుంగొయ్యి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాల కనకదుర్గమ్మ వారి నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్థానిక మహిళలంతా కలిసి 108 కలశములతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ప్రాంగణం నుంచి ప్రారంభించి మెయిన్‌రోడ్డు, ధనలక్ష్మి అమ్మవారి ఆలయం, వేణుగోపాలస్వామి గుడివీధి, వృద్ధాశ్రమం రోడ్డు, అశోక్‌నగర్, కనకదుర్గమ్మ వారి గుడి రోడ్డు మీదుగా సాగింది. దీనిలో భాగంగా పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ... తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో కొనసాగించారు. ఉత్సవ కమిటీ కుర్రాళ్లు, యువకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దేవరపల్లి: దేవీ నవరాత్రుల సందర్భంగా గురువారం దేవరపల్లిలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. స్థానిక మూడుబొమ్మల సెంటర్ వద్ద సౌభాగ్యదుర్గాంబిక, పల్లపు రామా లయం వద్ద కనక దుర్గమ్మ వారు, బాలదుర్గమ్మ ఆలయం వద్ద కనకదుర్గమ్మ అమ్మవారిని కాత్యాయనీ దేవిగా అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గోపాలపురం: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు గురువారం స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌లో ఉన్న లలితాంబిక అమ్మవారిని కాత్యాయనీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా లలితా సహస్రనామ పారాయణతో పాటు కుంకుమ పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు హాజరైన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నైవేద్యాలు సమర్పించారు.

వేగేశ్వరపురంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్

తాళ్లపూడి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురంలో గురువారం స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో మహిళలకు, వృద్ధులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. దీనిలో భాగంగా టీబీ వ్యాధిగ్రస్తులకు ఫుడ్ బకెట్లను అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కైగాల శ్రీనివాస్, సర్పంచ్ కే. పరశురామారావు, బీజేపీ మండలాధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ, బూసి సురేంద్రనాథ్ బెనర్జీ, గోకవరపు జితేంద్రరవి, రాయపాటి లక్ష్మణరావు, డాక్టర్ హారికాగుప్త, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సత్యవాడలో వైద్యశిబిరం

ఉంగ్రాజవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవాడలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళలకు వేలివెన్ను పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ వై.సృజన మహిళలకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, బాలికలకు వివిధ రోగాలకు సంబంధించిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కే. సుభాషిణి, వైద్యసిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మోర్తలో సామూహిక సీమంతాలు

ఉంగ్రాజవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెరవలి ప్రాజెక్టు ఆధ్వర్యంలో మోర్తలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గర్భిణులకు సీమంతాలు చేస్తున్నట్టు సీడీపీవో ఆశారోహిణి తెలిపారు. సర్పంచ్ చిటికిన సుజని, పంచాయతీ కార్యదర్శి టీ.బాలత్రిపురసుందరి, సూపర్‌వైజర్ సరస్వతి, వీఆర్వో అప్పారావు, ఆయాలు పాల్గొన్నారు.

ఊళ్లకు వెళితే ముందస్తు సమాచారమివ్వండి


ఎస్ఐ రామకృష్ణ

తాళ్లపూడి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దసరా సెలవుల నేపథ్యంలో మండలానికి చెందిన ప్రజలు సొంత ఊళ్లకు వెళితే ముందస్తుగా పోలీసులకు సమాచారం అందజేయాలని ఎస్ఐ టీ. రామకృష్ణ తెలిపారు. గురువారం ఎస్ఐ మాట్లాడుతూ కొద్ది రోజులుగా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రోబరీ గ్యాంగ్ ఈ చుట్టుపక్కల ఏరియాల్లో తిరుగుతోందన్నారు. జిల్లాలోని నల్లజర్లలో ఓ ఇంట్లో దొంగతనం చేసిందని, అందువల్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనపడితే వెంటనే 112 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు.

యర్నగూడెం గ్రంథాలయ శాఖ అధ్యక్షుడిగా ప్రతాప్‌కుమార్


నూతనంగా ఎన్నికైన వారితో గ్రంథాలయాధికారి అనిత

దేవరపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): యర్నగూడెం శాఖ గ్రంథాలయ శాఖ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా బొడ్డు ప్రతాప్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన గ్రంథాలయ అభివృద్ధి కమిటీ నియామకాలు చేపట్టాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంఈవో ఎస్‌వీవీ అప్పారావు సమక్షంలో మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఇందులో అధ్యక్షుడిగా బొడ్డు ప్రతాప్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎనిగంటి వెంకటస్వామి, కార్యదర్శిగా చింతా సాయి చైతన్య, సహాయ కార్యదర్శిగా పరమేశ్వర రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతా భరత్‌బాబు, ఎంపీటీసీ బొంతా చినబాబు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు బొల్లిన విజయ భాస్కర్, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు వద్దిసీడి నరేంద్ర, జూనియర్ కాలేజీ చైర్మన్ గద్దే శ్రీనివాస్, వీఆర్వో బాషా, గ్రంథాలయాధికారి అనిత, తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి తలుపులు పగలగొట్టి..

వృద్ధురాలిని కొట్టి..

● 15 కాసుల బంగారం, రూ.50 వేల నగదు దోచుకున్న నలుగురు దుండగులు
● రెండు మోటార్ సైకిళ్లను సైతం దొంగిలించి వాటిపై పరారీ
● నల్లజర్లలో ఘటన


బీరువాలోని దుస్తులను చెల్లాచెదురుగా పడేసిన దొంగలు


గాయపడిన వృద్ధురాలు

నల్లజర్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లజర్లలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఓ ఇంటి తలుపులు పగల గొట్టి ప్రవేశించి నిద్రిస్తున్న ఒంటరి వృద్ధురాలిపై దాడి చేసి మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవిదిద్దులు, బీరువాలో ఉన్న 4 గాజులు మొత్తం 15 కాసుల బంగారుం, రూ.50 వేల నగదు దోచుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లజర్ల సెంటర్‌లో వృ ద్ధురాలు పాకలపాటి సుభద్ర ఒంటరిగా నివాసం ఉంటుంది. కుమారుడు రమేష్ తల్లికి పగలు సేవలందించి రాత్రి అదే గ్రామంలోని అత్తగారింటికి వెళ్లి నిద్రి స్తాడు. ఇది గమనించిన దుండగులు బుధవారం అర్ధరాత్రి 1.30 గంటలకు నలుగురి ముసుగులు ధరించి ముందుగా ఇంటి తలుపు కొట్టారు. తీయకపోవడంతో పగుల గొట్టి లోపలికి ప్రవేశించారు. ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవి దిద్దులు తీసుకుని బీరువా తాళాలు ఎక్కడున్నాయని ఆమెపై రాళ్లతో దాడి చేశారు. ఆమె గాయాలు భరించలేక బీరువా తాళాలు ఇచ్చేసింది. బీరువాలో ఉన్న 4 బంగారు గాజులు, రూ. 50 వేల నగదు దోచుకున్నారు. భయంతో వృద్ధురాలు బిగ్గరగా కేకలు వేయడంతో దొంగలు ఆమె సెల్‌ఫోన్ తీసుకుని గోడ దూకి పక్కింట్లోని రెండు మోటార్‌సైకిళ్లను సైతం దోచుకుని వాటిపై పారిపోయారు. తర్వాత తేరుకున్న సుభద్ర సెంటర్‌కు పరిగెత్తుకుంటూ వెళ్లి మరొకరి సెల్ ఫోన్ తీసుకుని కుమారుడు రమేష్‌కు ఫోన్ చేయడంతో అతడు వచ్చి పోలీ సులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన జరిగిన ప్రదేశానికి వచ్చి కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, దేవరపల్లి సీఐ నాయక్ పరిశీలించారు. రాజమహేంద్రవరం నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేశామని, నిందితులను త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. సుభద్ర ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలో దుండగులు వచ్చిన దృశ్యాలు కనిపిస్తున్నాయని, వారి కోసం నాలుగు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నట్టు పేర్కొన్నారు.